క్లుప్తంగా

రేపు విశ్వకర్మ మహాయజ్ఞం

జడ్చర్ల టౌన్: విశ్వకర్మ జయంతి పురస్కరించుకుని గంగాపురం రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో మంగళవారం విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు.. విశ్వబ్రాహ్మణ పంచదాయుల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు చిగుళ్లపల్లి అమర్‌నాథ్‌గుప్త ఆదివారం తెలియజేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ప్రాంగణాన్ని కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యంలో చదును చేయగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయాన్ని శుద్ధి చేశారు.

సభ్యత్వ నమోదు

హన్వాడ: టంకరలో ఆదివారం బీజేపీ మండల నాయకుడు రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. శక్తికేంద్ర ఇంచార్జీ హనుమంతు, కదిరె శేఖర్, కావలిరాజు, వార్ల చంద్రయ్య, కృష్ణయ్య, కేశవులు, నర్సింలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా ఫాతిమా

గండేడ్: వెన్నాచేడ్ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఫాతిమా నియమితులయ్యారు. ఈమేరకు అడిషనల్ డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం మాడల్ స్కూల్‌కు 18 మంది ఉపాధ్యాయులు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న 15 మంది ఉపాధ్యాయులు కందుకూరు, సిద్దిపేట, ఖమ్మం, గుండుమాల్, ఖిల్లా ఘనాపూర్, ధన్వాడ తదితర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. కాగా పెబ్బేర్ మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఫాతిమా వెన్నాచేడ్‌కు బదిలీ అయి విధుల్లో చేరారు.

రాజ్యాధికారమే లక్ష్యం

జడ్చర్ల టౌన్: బీసీజాగృతి సేన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన బూర్గుపల్లి కృష్ణయాదవ్‌ను ఆదివారం జడ్చర్ల మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు భీంరాజ్ మాట్లాడుతూ రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేద్దామని.. ఆ దిశగా కృషిచేస్తున్న బీసీదళపతి ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో కృష్ణయాదవ్ బీసీజాగృతి సేన అధ్యక్షుడిగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బీసీల అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. నాయకులు నిరంజన్, నర్సింహులు, లింగంపేట శేఖర్, గోపాల్, సురభి, రఘు, శివశంకర్, రాములు, నరేందర్‌లు పాల్గొన్నారు.

ఏచూరికి నివాళి

భూత్పూర్: ఎల్కిచర్లలో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో సీపీఎం ముఖ్య నేత సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. గ్రామ పంచాయతీ కార్మికుల జనరల్ బాడీ సమావేశానికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎస్.కురుమూర్తి సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూల మాలలు వేశారు. కార్మికుల తరపున నిరంతరం గళం విప్పిన గొప్ప కమ్యూనిస్టు యోధుడని, ఆయన మరణం యావత్తు కార్మిక వర్గానికి తీరని లోటని వారు అన్నారు. నర్సింహులు, నాగమణి, చంద్రయ్య, నాగయ్య తదితరులు ఉన్నారు.

ఇసుక రవాణా నిలిపివేయాలి

రాజాపూర్: మండల శివారులోని దుందుభీ నదిలో నుంచి ఇసుక రవాణాను నిలిపివేసి తమను ఆదుకోవాలని రాజాపూర్ గ్రామానికి చెందిన రైతులు నర్సింహరెడ్డి, సూర్యశేఖర్ తదితరులు పేర్కొన్నారు. ఆదివారం వాగులో అక్రమ ఇసుకను తరలించడంతో ఏర్పడిన గుంతలను వారు చూయించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇసుకను ఇలాగే తరలిస్తే భవిష్యత్ తరాలకు సమస్యలు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వాగులో ఉన్న ఇసుకను తోడేశారని అన్నారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తే వారు దాడులు చేసి వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినా.. అక్రమార్కుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదని పేర్కొన్నారు.

ప్రవక్త మార్గంలో నడుద్దాం

స్టేషన్ మహబూబ్‌నగర్: అల్లా చివరిదూత మహ్మద్ ప్రవక్త (స.అస) మార్గంలో నడుద్దామని ప్రముఖ ధార్మికవేత్త మౌలానా ఖదీర్ ఖాద్రీ అన్నారు. జిల్లా కేంద్రం న్యూప్రేమ్‌నగర్‌లోని అన్వారే మదీనా మజీద్‌లో ఆదివారం రాత్రి మిలాదున్నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులు నాతేషరీఫ్‌లను ఆలపించారు. అనంతరం మతపెద్ద ధార్మిక సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్క ముస్లిం ఐదు పూటల నమాజు చేయాలని, పవిత్ర ఖురాన్‌ను పఠించాలని కోరారు. ప్రవక్త సున్నత్‌లను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో మజీద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అక్బరీ, మహ్మద్ ఇస్మాయిల్, సంయుక్త కార్యదర్శి సయ్యద్ ఇస్మాయిల్, రహీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానంపై హర్షం



నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి సంతకు వచ్చిన ప్రజల సౌకర్యం కోసం ఉచిత అన్నదానం ప్రారంభించారు. ఆదివారం దాదాపుగా 5 వందల మందికి అన్నదానం చేశారు. అన్నదానంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. సుధాకర్‌చారీ, రఘువీర్‌శర్మ, పుట్టి అంజనేయులు, సత్యం, నిరంజన్ ఉన్నారు.



అప్పంపల్లిలో..



పేరూర్‌లో విజేతలకు బహుమతుల పంపిణీ

గణపయ్యా వెళ్లి రావయ్యా..

పాలమూరు: పీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఆదివారం రాత్రి ఎంపీ డీకే అరుణ పూజలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పీయూ అభివృద్ధి కోసం రూ.150కోట్ల నిధులు ఇచ్చిందన్నారు. అదేవిధంగా పట్టణంలోని పాత గ్రంథాలయం, బండ్లగేరి, కన్యాకపరమేశ్వరి ఆలయం, బ్రాహ్మణవాడీ, అశోక్ టాకీస్, పద్మావతి కాలనీల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలో ఆదివారం గణేశ్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఊరేగింపు నిర్వహించారు. తీగలప్పకట్ట భారీ గణేశ్ విగ్రహంతో పాటు కుర్వగేరి వినాయకుడు, దళితవాడ వినాయక విగ్రహాల ఊరేగింపు కోలాహలంగా సాగింది. ఈ మేరకు దేవరకద్ర పెద్ద చెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేశారు. ఇక్కడి పోలీసులు, రెవెన్యూ అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు. నీటిలోకి దిగకుండ బారీకేడ్లను ఏర్పాటు చేశారు.

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నచింతకుంట, లాల్‌కోట, ఉంధ్యాల, అల్లిపూరం, నెల్లికొండి, అమ్మపూరం, అప్పంపల్లి, గణపతులను నిమజ్జనానికి తరలించారు.

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు గ్రామాలల్లో ఆదివారం నిమజ్జనం నిర్వహించారు. మద్దిగట్లలో లక్ష్మీకాంత్‌రెడ్డి రూ.11,300 కు లడ్డు వేలం పాటను దక్కించుకున్నారు.

రాజాపూర్(బాలానగర్): ఉడిత్యాల నేతాజీ యువ జనసంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిరంజన్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, మనికంఠ, సుభాష్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: గణనాథుల నిమజ్జనానికి జడ్చర్లలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల చెరువు వద్ద ఇప్పటికే వినాయకుల నిమజ్జనం కొనసాగుతోంది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నేతాజ చౌరస్తాలో స్వాగత మండపం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు మండపాల వద్ద ఎంపీ డీకే అరుణ పాల్గొని పూజలు చేశారు.



జడ్చర్ల వీరశివాజీనగర్‌లో పర్యావరణ గణనాథుడు



నవాబుపేటలో..

దేవరకద్ర రూరల్: కొకుంట్ల మండలం, పేరూర్‌లో యాదవ వీధిలో వినాయక మండపం దగ్గర ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. మొదటి స్థానంలో అద్దాకుల, ద్వితీయ స్థానంలో అమ్మాపూర్ జట్లు నిలిచాయి. విజేతలకు టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ రెడ్డి బహుమతులను ప్రధానం చేశారు. గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్ మొదటి విజేతకు, రూ.5016లు అందించగా, రెండవ విజేతకు శ్రీనివాస్ సాగర్‌లు రూ. 3016 అందజేశారు.

నవాబుపేట: మండల పరిధిలో వినాయక మండపాల చెంత సత్య పూజలు కొనసాగుతున్నాయి. దేపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి నిమజ్జనం సంధర్బంగా లడ్డూ వేలం నిర్వహించారు. హనుమాన్ ఆలయ గణపతి లడ్డూను గ్రామానికి చెందిన కోట పోషెట్టి రూ. 2 లక్షల 11 వేలకు దక్కించుకున్నాడు. చిన్నలడ్డూను గ్రామానికి చెందిన సతీష్‌గౌడ్ రూ. 45 వేలకు సొంతం చేసుకున్నాడు. వెంకటేష్‌గౌడ్, సతీష్‌గౌడ్, రాములు తదితరులు ఉన్నారు.



ఆదర్శనగర్ బంజారా కాలనీలో..



దేవరకద్రలో ఊరేగింపులో పాల్గొన్న బాలికలు



మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయంలో..



ఉంధ్యాలలో అన్నదానం



దేపల్లిలో లడ్డూలు దక్కించుకున్న గ్రామస్తులు



బలుసుపల్లిలో..



జడ్చర్ల చంద్రశేఖర్ ఫామ్స్‌లో..



మద్దిగట్లలో లడ్డూను వేలంలో దక్కించుకున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

జడ్చర్లలో వీధి కుక్కల బెడద



పట్టణంలో కుక్కల విహారం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో రోజురోజుకూ కుక్కల బెడద అధికమవుతోంది. పిల్లలను ఒంటరిగా బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు వెనుకంజ వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గుంపులు గుంపులుగా గ్రామసింహాలు పెరుగుతుండటంతో కాలనీల్లో ప్రజలు ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నారు. ఏ కాలనీకి వెళ్లినా గుంపులుగా తిరుగుతూ మనుషులపైకి వస్తుండటంతో రాత్రిళ్లు పెద్దవాళ్లు సైతం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. తెల్లవారుజామున పాలకు వెళ్తున్న వారిపైనా కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి.

పాఠశాలలకు పంపాలంటే భయం..

కుక్కల భయంతో పిల్లలను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లోంచి బయటకు వస్తే ఎటువైపునుంచి కుక్కలు వస్తాయో తెలియని అయోమయ పరిస్థితిలో ఉంటున్నామని చెబుతున్నారు. సాయినగర్, గౌరీ శంకర్‌కాలనీ, గాంధీనగర్, పాతబజార్, విద్యానగర్, తాలూకా క్లబ్, జౌఖినగర్, లక్ష్మీనగర్‌లలో కుక్కల బెడద అధికంగా ఉందని చెబుతున్నారు. గంగాపురం రోడ్డులో అధికంగా మాంసం విక్రయాలు రోడ్డుపైనే జరుగుతున్నాయి. వాటి వ్యర్థాల కోసం కుక్కలు గుంపులుగా వస్తున్నాయని ఈ క్రమంలోనే అటువైపు వెళ్తున్న వారిపైకి ఎగబడుతూ భయాందోళలకు గురిచేస్తున్నాయని పలువురు వాపోతున్నారు.



క్లబ్‌రోడ్డులోని ఓ దుకాణం వద్ద కుక్కలు

రాత్రిళ్లు ఇబ్బందులు

మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోనూ ఫార్మాసెజ్‌లో పనిచేసే ఉద్యోగులు, చిరు వ్యాపారులు నివాసం ఉంటున్నారు. వీరు రాత్రిళ్లు విధులు ముగించుకుని, వ్యాపారాలు ముగించుకుని ఇళ్లకు వెళ్లే సమయంలో కుక్కల భయం వెంటాడుతోంది. ముఖ్యంగా రాత్రి 8గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు కుక్కలు అధికంగా భయపెడుతున్నాయి. రోడ్డుపై ఒక్కరు కనిపిస్తే చాలు వెనకబడి పైకి ఎగురుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

నియంత్రణకు చర్యలు..

మున్సిపాలిటీలో కుక్కల బెడద అధికం అయ్యిందని చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు విషయాన్ని వివరించాం. వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం. అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేను కలిసి కుక్కల సమస్యను వివరించి నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

– ఎస్.రాజయ్య, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

అవస్థలు పడుతున్నాం..



కుక్కలు చాలా ఇబ్బంది పెడుతున్నాయి. కంపెనీకి వెళ్లి తిరిగి రూంకు వెళ్తుంటే గట్టిగా అరుస్తూ పై పైకి వస్తాయి. ఏ వైపు నుంచి వస్తాయో తెలియదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పోవాల్సి వస్తోంది. అవస్థలు పడుతున్నాం. కుక్కల బెడద తప్పిస్తే బాగుంటది.

– మోహన్, విద్యానగర్

కుక్కలు చాలా పెరిగిపోయాయి..



జౌఖినగర్‌లో కుక్కలైతే చాలా పెరిగిపోయాయి. రోడ్డు పొడుగునా ఇళ్లవద్ద ఉండటంతో నడవాలంటే భయం వేస్తుంది. పగటిపూటనే వాటిని చూస్తే జడుసుకోవాల్సిందే. కొంచెం చీకటి పడితే చాలు అరుస్తూ రోడ్డుపై వెళ్లే వారందరిని భయపెడుతున్నాయి. ఇంటి గేటు తెరిచిపెడితే చాలు ఇంట్లోకి వచ్చి తినుబండారాలు తినివెళ్తున్నాయి. బెదిరిస్తే కరిచేందుకు మీదకు వస్తున్నాయి. కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– అర్షద్ నిజామి, జౌఖినగర్, జడ్చర్ల

కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం



కుక్కల బెడద విషయంలో కౌన్సిల్ సభ్యులందరితోనూ చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం. కుక్కల విషయం కోర్టు పరిధిలో ఉన్నందున ఎలాంటి చర్యలు తీసుకునే వీలు లేదు. అయినప్పటికీ ఏం చేయాలనే విషయంలో కౌన్సిల్ సభ్యులతోపాటు అధికారులను సంప్రదించి చర్యలు తీసుకుంటాం.

– పాలాది సారిక, ఇన్‌చార్జి చైర్‌పర్సన్, మున్సిపాలిటీ, జడ్చర్ల

మిషన్ భగీరథ నీరు కలుషితం

- తాగడానికి వాడవద్దని మున్సిపల్ సిబ్బంది సూచన



జడ్చర్ల పట్టణానికి సరఫరా చేసిన కలుషిత నీరు



కలుషిత నీటిని చూపిస్తున్న జడ్చర్ల స్థానికులు

జడ్చర్ల టౌన్: పట్టణ పరిధిలో మిషన్ భగీరథ నీరు కలుషితంగా రావటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హౌజింగ్‌బోర్డు కాలనీలో మూడురోజుల క్రితం, అదేవిధంగా ఆదివారం వచ్చిన నీరు పూర్తిగా ఒండుమట్టి కలిసి ఉన్నాయని పేర్కొన్నారు. ముందుగా ఒకరిద్దరి ఇళ్లకు మాత్రమే ఇలా నీరు వచ్చాయని భావించినా.. కాలనీమొత్తం ఇలాగే సరఫరా అయ్యిందని తెలియటంతో ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ నీటి సరఫరా సిబ్బందిని కాలనీ వాసులు ప్రశ్నించగా నీరు తాగొద్దని తాపీగా చెప్పడం గమనార్హం. మరో రెండు, మూడు రోజులు ఇలాగే వస్తాయని చెప్పడంతో కాలనీవాసులు అయోమయానికి గురవుతున్నారు. విషయం మిషన్ భగీరథ ఏఈ మొగులాల్ దృష్టికి తీసుకువెళ్లగా ట్యాంకులు సక్రమంగా శుభ్రం చేయకపోతే అలా వస్తాయని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. కాగా నవాబుపేట మండలంలోనూ మూడు రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతుందని ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు. మల్లెబోయిన్‌పల్లి గ్రామం వద్ద ఉన్న ట్యాంక్ వద్ద మోటర్లు పాడవటంతో ఇటీవలే మరమ్మతు చేశారు. దాని వల్లే ఇలా కలుషిత నీరు వస్తోందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఇంజినీరింగ్ డే వేడుకలు



స్విట్స్ కళాశాలలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

దేవరకద్ర రూరల్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆవిష్కరణలు భావితరాల ఇంజినీర్లకు స్ఫూర్తిదాయకమని స్విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఆదివారం చౌదరిపల్లి సమీపంలోని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

జడ్చర్ల టౌన్: జాతీయ ఇంజినీర్స్ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం సంస్కార భారతి ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న రిటైర్డ్ ఏఈ బుచ్చయ్య మాట్లాడుతూ దేశానికి విశిష్ట సేవలు అందించిన గొప్ప ఇంజనీర్ విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఇంజనీర్లు జావిద్, మహేందర్, సంస్కార భారతి సభ్యుడు రాధాకృష్ణ, అమర్‌నాథ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంజనీర్ బుచ్చయ్యను ఘనంగా సత్కరించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఆదివారం జరిగిన 19వ నేషనల్ లెవల్ వీఐపీ చాలెంజర్ కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రంలోని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటేడూ ఇండియా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు పట్టణ ఉపాధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ పోటీల్లో ఆయా విభాగాల్లో వి.ఆధ్య, బి.వరుణ్, పి.అక్షయ్‌సాయి, కె.శ్రీచరణ్‌చారి, ఎ.విశ్వకరణ్, హృతిక్‌కుమార్ దుర్గ, హారిక, సాయితేజ బంగారు పతకాలు, సాయికృతిక రజత పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థులను జీకే మాస్టర్ షోటోకాన్ చీఫ్ జి.క్రిష్ణయ్య అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఉపవాసంతో దేవుడిని ఆరాధించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపవాసంతో దేవుడిని ఆరాధించాలని రెమా వర్షిప్ సెంటర్ డైరెక్టర్ పాస్టర్ బీఎస్.పరంజ్యోతి అన్నారు. వచ్చేనెల 3 నుంచి జరిగే ఉపవాస ప్రార్థనలకు సంబంధించిన పోస్టర్లను రెమా చర్చిలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉపవాసం ఉండి దేవుడిని ప్రార్థించాలనే ఉద్దేశంతో ఏటా ఉపవాస ప్రార్థనల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చేనెల 3 నుంచి 6వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో ప్రార్థనల్ని నిర్వహిస్తామని అన్నారు. అంతర్జాతీయ ప్రసంగీకులు జెర్మియా, కేపీ.పాల్, ప్రశాంత్‌జోష్, జోయెల్‌బాబు, ప్రశాంత్, సవారపు చిన్ని, పాల్‌రాజు హాజరవుతారని వివరించారు. సంఘ పెద్దలు దేవయ్య, భరత్, శ్యాంసుందర్, రామాంజనేయులు, జాన్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాస్టర్ పరంజ్యోతి తదితరులు

దళిత కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి



సర్వే నిర్వహిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: దళితుల కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని మల్లెబోయిన్‌పల్లి, భూరెడ్డిపల్లి, మాచారం, నెక్కొండ, గోప్లాపూర్ గ్రామాల దళితుల కాలనీల్లో సర్వేనిర్వహించినట్లు వివరించారు. దళితుల జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదని, రోజువారి కూలీలుగా, ఆటోడ్రైవర్లుగా అడ్డమీది కూలీలుగా జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల వాడల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్య, వీధిలైట్లు వెలగటం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిధుల కేటాయింపులు చేయాలన్నారు. అలాగే దళితుల అసైన్, గైరాన్ భూములకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, యాదయ్య, సత్యమ్మ, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్ సమీపంలోని లేబర్ కాలనీలో నివాసం ఉంటున్న బీహార్ రాష్ట్రానికి చెందిన చందేశ్వర్ సా(35) శనివారం రాత్రి కనిపించకుండా పోయినట్లు ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపారు. సోదరుడు సురేంద్రసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.